సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 9 । ఆగస్టు । 2024



ఒలింపిక్ పతకాలే లక్ష్యంగా..
ఒలింపిక్ పతకాలే లక్ష్యంగా ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ కార్యక్రమాన్ని నగరంలో నిర్వహించారు.
- 8లో ▸



కమ్యూనికేషన్ స్కిల్స్‌ను..
పోటీ ప్రపంచంలో రాణించేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.7/21.7

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మలేరియా వార్డు పరిశీలన



నిజామాబాద్‌నాగారం: మలేరియా బాధితుల కోసం జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వార్డును జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ గురువారం పరిశీలించారు. మలేరియా బారిన పడిన వారికి చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా వార్డు ఏర్పాటు చేశామన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ఆర్మూర్‌టౌన్: వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిణి అన్నపూర్ణ అన్నారు. 'స్వచ్ఛదనం – పచ్చదనం' కార్యక్రమంలో భాగంగా సీజనల్ వ్యాధుల నివారణపై పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. అనంతరం దోమల నివారణ చర్యల్లో భాగంగా మామిడిపల్లిలోని 24వ వార్డులో నిల్వ ఉన్న నీటిలో గంబూసియా చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నల్‌దేవి లావణ్య, మున్సిపల్ కమిషనర్ రాజు, ప్రిన్సిపాల్ చంద్రిక, కౌన్సిలర్లు ఆకుల రాము, శాల ప్రసాద్, భారతి, రింగుల భూషణ్, సానిటరీ ఎస్సై గజానంద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పూర్ణమౌళి, సీనియర్ అసిస్టెంట్ శేఖర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం చివరి విడత కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్, సమన్వయకర్త నరేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం వెబ్ ఆప్షన్ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. మొదటి, రెండో దశలో సీట్ల కేటాయింపుపై అసంతృప్తితో ఉన్న వారితోపాటు మొదటి, రెండో దశ కౌన్సెలింగ్‌లో సీట్లు రానివారు సైతం వెబ్ ఆప్షన్ ఎంచుకోవచ్చని తెలిపారు. ఈనెల 31వ తేదీలోగా సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లాకు చెందిన బీసీ అభ్యర్థులు వివిధ అంశాల్లో ఉచితంగా ఫ్రీ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కో ఆర్డినేటర్ వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్జీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1 నుంచి నవంబర్ 31వ తేదీ వరకు రిఫ్రిజిరేటర్, వాషింగ్‌మెషిన్, డిష్ వాషర్, ఏసీ రిపేర్, ఇన్‌స్టాలేషన్, గ్యాస్ చార్జింగ్, ఎల్జీవీ, ఓఎల్‌ఈడీ మానిటర్, మైక్రో ఓవెన్, వాటర్ ప్యూరిఫైర్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ కాలంలో నెలకు రూ.4వేల చొప్పున స్టైఫండ్ ఉంటుందని, పదో తరగతి లేదా ఇంటర్ పాసైన 18 నుంచి 25 ఏళ్లలోపు అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 08462 241055 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పెరిగిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను 3 వేల క్యూసెక్కులకు ప్రాజెక్ట్ అధికారులు పెంచారు. సరస్వతి కాలువ ద్వారా 100, లక్ష్మీకాలువ ద్వారా 50 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 502 క్యూసెక్కులు పోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి 3,883 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దానికి సమానంగా అవుట్‌ఫ్లో ఉండడంతో ప్రాజెక్టు నీటి మట్టం నిలకడగా ఉంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు)అడుగులు కాగా, గురువారం సాయంత్రానికి 1080.80(47.25 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

ప్రకృతి అందం



మనస్సును అలరించే ఈ దృశ్యం మామిడిపల్లి తండా ప్రాంతంలోనిది. చుట్టూ కొండలు, పెద్ద పెద్ద చెట్లు.. చెరువు అందాలను తనివితీరా చూస్తూ కూర్చునేందుకు అనువుగా ఉన్న పచ్చిక బయళ్లు.. చెరువు చెంతనే పరుచుకున్న పచ్చదనం మానసిక ప్రశాంతతను చేకూరుస్తోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఎదురుచూపులు.. అనుమానాలు

- అర్హులైనప్పటికీ రుణమాఫీకి నోచుకోని పలువురు రైతులు
- నమోదులో బ్యాంకర్ల తప్పిదాలతో నష్టం
- పలు సహకార సంఘాల్లో తీరని సమస్య
- మూడో విడత పూర్తయ్యాక స్పష్టత వచ్చే అవకాశం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రైతు రుణమాఫీకి రాష్ట్ర ప్రభుత్వం మూడు విడతల ప్రక్రియ చేపట్టింది. ఇప్పటివరకు మొదటి రెండు విడతల్లో మాఫీ చేసే ప్రక్రియ పూర్తి చేశారు. మూడో విడతకు సైతం రంగం సిద్ధం చేశారు. మొదటి రెండు విడతల్లో అర్హులైన పలువురు రైతులకు రుణమాఫీ లభించకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతుల పరిస్థితి అటు ఎదురుచూపులు.. ఇటు అనుమానాలు అనేలా తయారైంది. అర్హత ఉన్నప్పటికీ మాఫీ కాకపోవడంతో అధికారులను సంప్రదించగా వివిధ రకాల సమస్యలను సరిదిద్దుతామని చెబుతున్నారు. అయితే స్పష్టత కొరవడింది. దీంతో రూ.1 లక్ష లోపు, రూ.1.5 లక్షల లోపు రుణాలు ఉండి రుణమాఫీ దక్కని రైతులు తమకు ఎప్పుడు లబ్ధి చేకూరుతుందోనని ఆందోళనకు గురవుతున్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియ ఈ నెల 15వ తేదీకి అవుతుందని, ఆ తరువాత మొదటి రెండు విడతల్లో అర్హత ఉన్నప్పటికీ మాఫీ అందని రైతులకు వస్తుందని చెబుతున్నప్పటికీ అనేక అనుమానాలు కలుగుతున్నాయి. రేషన్ కార్డులు లేకపోవడం, ఆధార్, బ్యాంకు ఖాతాల్లో పేర్లు తేడాగా ఉన్నాయనే కారణాలతో పాటు బ్యాంకు ఖాతాలు, ఆధార్, ఫోన్ నంబర్లు సక్రమంగానే ఉన్నప్పటికీ చాలామంది రైతులకు మాఫీ చేకూరకపోవడం గమనార్హం.

- ఎడపల్లి సహకార సంఘం పరిధిలో 380 మంది రైతులు ఉండగా మొదటి విడతలో 43 మందికి, రెండో విడతలో ఆరుగురికి మాత్రమే మాఫీ అయింది. మిగిలిన 331 మందికి రూ.1 లక్ష, రూ.1.5 లక్షల లోపే రుణాలు ఉన్నప్పటికీ మాఫీ కాలేదు. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవీపేట మండలంలోని బినోల సహకార సంఘం పరిధిలో 17 గ్రామాలకు చెందిన 5 వేల మంది సభ్యులు ఉండగా, 1,080 మంది రైతులు రుణమాఫీకి అర్హులుగా తేలారు. రూ.1.5 లక్షల లోపు రుణమాఫీ రావాల్సిన రైతులు 800 మంది ఉండగా ఇందులో కేవలం 407 మందికి మాత్రమే లబ్ధి చేకూరింది. మిగిలిన రైతులు తమకు వస్తుందో రాదోనని ఆందోళన చెందుతున్నారు. అధికారులు ఆన్‌లైన్‌లో ఆలస్యంగా నమోదు చేసిన నేపథ్యంలోనే ఈ పరిస్థితి నెలకొనడం గమనార్హం.
- సిరికొండ మండలం తూంపల్లి సొసైటీలో 180 మంది రైతులకు సంబంధించి ఆన్‌లైన్ చేయకపోవడంతో సదరు రైతులకు రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ చేయలేదు. దీంతో ఆ రైతులు లబోదిబోమంటున్నారు.
- ఆర్మూర్ మున్సిపల్ సహకార సంఘం పరిధిలో 266 మంది రైతులకు అర్హత ఉన్నప్పటికీ మొదటి విడతలో కేవలం 8 మంది రైతులకు, రెండో విడతలో 11 మందికి మాత్రమే రుణమాఫీ లభించింది. ఇదిలా ఉండగా ఆర్మూర్‌లోని యూనియన్ బ్యాంక్ పరిధిలో 2,500 మంది రైతులకు గాను కేవలం 45 మందికి మాత్రమే రుణమాఫీ దక్కడం గమనార్హం.
- నందిపేటలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో 200 మంది రైతులకు సంబంధించి ఖాతా నంబర్లను తప్పుగా నమోదు చేయడంతో రుణమాఫీ అందలేదు. ఖాతా నంబరుకు ప్రారంభంలో ఉండే సున్నా అంకెను నమోదు చేయని కారణంగా సిస్టమ్ తీసుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మాక్లూర్ ఇండియన్ బ్యాంకులో సైతం నమోదు సక్రమంగా చేయడంతో 150 మంది రైతులు మాఫీకి నోచుకోలేకపోయారు. ఈ విషయమై మండల వ్యవసాయ అధికారి చెప్పినప్పటికీ సదరు బ్యాంకు అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.
- ఇందల్వాయి మండలం సిర్నాపల్లి ఇండియన్ బ్యాంకులో 800 మంది రైతులు ఉండగా అందులో కేవలం ఒక్కరికి మాత్రమే రుణమాఫీ దక్కడం గమనార్హం.
- జిల్లాలో అనేక మంది రైతులకు సంబంధించి 2018 డిసెంబర్ 12 కటాఫ్ తేదీకి ముందు తీసుకున్న రుణాలకు ఎప్పటికప్పుడు రెన్యువల్ చేస్తూ వచ్చారు. దీంతో వీరికి రుణమాఫీ దక్కలేదు. మరోవైపు 2023 డిసెంబర్ 009 కటాఫ్ తేదీకి ముందే రుణం తీసుకున్న రైతులకు సంబంధించి నమోదు చేసే విషయంలో ఆలస్యం చేశారు. దీంతో కటాఫ్ తేదీ దాటిపోయింది. సదరు రైతులకు అన్యాయం జరిగింది.
- మూడో విడత రుణమాఫీ ప్రక్రియ పూర్తయ్యాక మూడు విడతలకు సంబంధించి అన్ని అంశాలు పూర్తిస్థాయిలో స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో రైతులతో పాటు బ్యాంకర్లు, అధికారుల్లో సైతం గుబులు నెలకొంది.

ఎస్సారెస్పీలో పూడికతీతపై ఆశలు

- దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- అధ్యయనానికి ఇరిగేషన్ మంత్రి అధ్యక్షతన సబ్ కమిటీ ఏర్పాటు
- భారీగా పేరుకుపోయిన పూడిక

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూడికతీతపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. సాధ్యాసాధ్యాల అధ్యయనానికి నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. 31.5 టీఎంసీల మేర పూడిక పేరుకుపోయినట్లు ఆరు నెలల క్రితం బెంగళూరుకు చెందిన ఓ సంస్థ సర్వే తేల్చింది. పూడికతీత చేపడితే నీటి నిల్వ సామర్థ్యం భారీగా పెరిగే అవకాశం ఉంటుంది.

పడిపోయిన నీటి నిల్వ సామర్థ్యం

112 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో ఎస్సారెస్పీని నిర్మించగా, హైడ్రోగ్రాఫిక్ సర్వే ఆఫ్ ఇండియా 1978లో నీటి నిల్వ సామర్థ్యాన్ని 112 టీఎంసీలుగానే పేర్కొంది. ప్రతి సంవత్సరం వరద కారణంగా 0.8 టీఎంసీల పూడిక వచ్చి చేరుతుందని అధికారిక రికార్డులు తెలుపుతుండగా, ప్రస్తుతం ప్రాజెక్టులో భారీగా పూడిక పేరుకుపోయింది. 1994లో చేపట్టిన సర్వే ప్రకారం ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలకు పడిపోయి.. 2024 వరకు అదే పరిస్థితి ఉంది. 2024 జనవరిలో చేపట్టిన సర్వేలో నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు పడిపోయినట్లు తేలింది. ఈ లెక్క ప్రకారం ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో ఉన్న నీటి నిల్వ సామర్థ్యానికి 31.5 టీఎంసీల పూడిక పేరుకుపోయింది.

తొలగిస్తే..

పూడికను తొలగిస్తే అదనంగా 31 టీ ఎంసీల నీరు నిల్వ చేసే అవకాశం ఉంటుంది. ఆయకట్టు రైతులకు సాగునీటి తిప్పలుతప్పుతాయి. ప్రస్తుతం ఉన్న 80 టీఎంసీల సామర్థ్యంతోనే రెండు పంటలకు నీటి సరఫరా అవుతుండగా, 112 టీఎంసీలకు నీటి నిల్వ సామర్థ్యం పెరిగితే మరో పంటకూ సకాలంలో నీటిని సరఫరా చేసే అవకాశం ఏర్పడుతుంది.

వెనక్కి తగ్గిన గత ప్రభుత్వాలు

పూడికను తొలగించేందుకు ప్రాజెక్టు నిర్మాణ కాలంలోనే ఆరు రివర్స్ స్లూయిజ్ గేట్లను నిర్మించారు. అయితే, ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఆ గేట్లను వినియోగించకపోవడంతో పూర్తిగా మట్టిలో కూరుకుపోయాయి. విదేశీ పరిజ్ఞానంతో పూడికను కరగదీసి తొలగించాలని గత ప్రభుత్వాలు ఆలోచించినప్పటికీ ఆచరణ సాధ్యం కాదని తేలడంతో వెనక్కితగ్గాయి. ప్రస్తుత ప్రభుత్వం పూడిక తొలిగింపుపై దృష్టి సారించినప్పటికీ ఎంత మేరకు సాధ్యమవుతుందనేది చర్చనీయాంశమైంది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలి



అధికారులకు శిక్షణ ఇస్తున్న డీపీఎం నరహరి

సుభాష్‌నగర్: త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వ మార్గదర్శకాలు విడుదలయ్యే అవకాశం ఉందున ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు గదిలో గురువారం ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ ఆపరేటర్లకు ఓటరు జాబితా తయారీపై శిక్షణ ఇచ్చారు. రామకృష్ణ, శ్రీనివాస్, డీపీఎం నరహరి ప్రొజెక్టర్‌పై శిక్షణ నిచ్చారు. డీపీవో మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటేసిన వారందరికీ గ్రామాల్లో ఓట్లు ఉండేలా చూడాలన్నారు. జెడ్పీ సీఈవో ఉష తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా వర్షాలు



సుభాష్‌నగర్: జిల్లావ్యాప్తంగా గురువారం విస్తారంగా వర్షం కురిసింది. ఎడపల్లి, మోస్రాలో 40.6 మి.మీ. వర్షం కురవగా, జిల్లాలో 17.2 మి.మీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 18 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 15 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

మండలం	వర్షపాతం మి.మీ						
		సాలూర	25.0	ని. సౌత్	18.8	మోర్తాడ్	14.5
ఎడపల్లి	40.6	డిచ్‌పల్లి	24.8	బాల్కొండ	18.2	రుద్రూరు	14.0
మోస్రా	40.6	ధర్పల్లి	23.5	ఇందల్వాయి	18.0	జక్రాన్‌పల్లి	13.8
బోధన్	35.0	ముప్కాల్	19.7	మాక్లూర్	17.9	చందూరు	13.6
మోపాల్	25.2	ని. నార్త్	19.8	ఆర్మూర్	16.6	కోటగిరి	13.1

ప్రదర్శనలో 'ప్రగతి' ప్రతిబింబించాలి

- పంద్రాగస్టు వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలి
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించనున్న శకటాలు ప్రగతిని ప్రతిబింబించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఆయా శాఖల అధికారులతో కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పంద్రాగస్టు వేడుకల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, పోలీస్ పరేడ్ మైదానంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ వర్గాల ప్రజల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వివరాలతో జిల్లా ప్రగతి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, జిల్లా గ్రామీణాభివృద్ధి, ఫారెస్ట్, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల పనితీరు చాటేలా శకటాల ప్రదర్శనతోపాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని, జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేని నేపథ్యంలో ప్రత్యేకాధికారులు ఉదయమే మండలాలు, గ్రామాల్లో జెండా ఆవిష్కరించి, జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకలకు సకాలంలో హాజరుకావాలని అన్నారు. ప్రత్యేకాధికారులు అందుబాటులో లేనిపక్షంలో మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు జెండాను ఆవిష్కరించవచ్చని సూచించారు. ఎక్కడ కూడా జాతీయ పతాకం గౌరవానికి భంగం వాటిల్లకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా నిర్ణీత గడువులోగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసిన గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులను సైతం ఉత్తమ జీపీలు, వార్డులుగా ఎంపిక చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం మకరందు, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్, జెడ్పీ సీఈవో ఉష, ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్లు లేక ఇబ్బందులు

- పంచాయతీరాజ్ శాఖలో ఖాళీగా ఇంజినీర్ల పోస్టులు
- నిజామాబాద్ సర్కిల్‌లో 116 పోస్టులకు 73 ఖాళీ
- క్షేత్రస్థాయిలో పనుల పర్యవేక్షణ కరువు



మోర్తాడ్(బాల్కొండ) : పంచాయతీరాజ్ శాఖను ఇంజినీర్ల కొరత వేధిస్తోంది. ఏఈఈ, జేఈలుగా పని చేసిన వారికి పదోన్నతులు లభించడం, పదవీవిరమణ కారణంగా ఖాళీల సంఖ్య పెరిగింది. పంచాయతీరాజ్ శాఖ నిజామాబాద్ సర్కిల్ పరిధిలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు ఉన్నాయి. రెండు జిల్లాల పరిధిలో 116 పోస్టులకు గాను 73 స్థానాలు ఖాళీగానే ఉన్నాయి. 43 మంది ఇంజినీర్లతోనే రెండు జిల్లాల్లోని 63 మండలాల్లో సాగుతున్న పనులను పర్యవేక్షించాల్సి వస్తుంది. మండలానికి ఒక ఏఈఈ లేదా జేఈ, అలాగే సబ్ డివిజన్ స్థాయిలో ఒక క్వాలిటీ కంట్రోల్ ఏఈఈ, స్పెషల్ ఏఈఈ ఒకరు పని చేయాలి. బాల్కొండ నియోజకవర్గంలోని 8 మండలాలకు ఇద్దరే ఏఈఈలు పని చేస్తున్నారు. ఈ ఇద్దరే తమ మండలాలతోపాటు అదనంగా మరో మూడు మండలాల పనులను పరిశీలించి ఎంబీలను రికార్డు చేయాల్సి వస్తోంది. ఆర్మూర్, నిజామాబాద్ రూరల్, బోధన్ నియోజకవర్గాలలోనూ అధికారులకు అదనపు బాధ్యతలను అప్పగించారు. బాన్సువాడ నియోజకవర్గంలో ఒక్కరే ఏఈ ఉండగా, కామారెడ్డి నియోజకవర్గంలో ఖాళీల సంఖ్య బాగానే ఉంది. క్వాలిటీ కంట్రోల్, స్పెషల్ ఏఈఈల బాధ్యతలను కొన్ని చోట్ల ఇతర సబ్ డివిజన్ ఏఈఈలకు అప్పగించారు. క్వాలిటీ కంట్రోల్‌కు సంబంధించి ప్రతి సబ్‌డివిజన్‌కు కచ్చితంగా అధికారులు పని చేయాలి. క్వాలిటీ కంట్రోల్ ఏఈఈలు సరిగా లేకపోవడంతో పనుల్లో నాణ్యతను ఎలా పరీక్షిస్తారనే సందేహం వ్యక్తమవుతోంది. తాజాగా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి రూ.10 కోట్ల స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను కేటాయించింది. ఈ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలలకు ప్రహరీలు, అంగన్‌వాడీ ఇతర కార్యాలయాల భవనాలను నిర్మించనున్నారు. ఏఈఈ పోస్టులు పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉండటంతో పనుల పర్యవేక్షణలో పారదర్శకత సాధ్యమవుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఏఈఈ పోస్టుల భర్తీపై సారించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం కట్టుబడి ఇంజినీర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వానికి విన్నవించాం

ఇంజినీర్ పోస్టుల ఖాళీ అంశాన్ని ప్రభుత్వానికి విన్నవించాం. పోస్టులను భర్తీ చేస్తే సమస్య పరిష్కారవుతుంది. సర్కిల్ పరిధిలో చాలా పోస్టులు ఖాళీగా ఉండటంతో పనుల పర్యవేక్షణలో ఇబ్బంది తలెత్తుతుంది. త్వరలోనే పోస్టుల భర్తీ జరగవచ్చు.

– ప్రభాకర్, ఎస్‌ఈ, పంచాయతీరాజ్ శాఖ

క్లుప్తంగా

16న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్



నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్ర ఆస్పత్రి తరఫున నగరంలోని ఇందూరు క్యాన్సర్ హాస్పిటల్‌లో ఈ నెల 16న 60 సంవత్సరాలు దాటిన వారికి క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ యూనియన్ నిజామాబాద్ అధ్యక్షుడు శిల్ప హనుమాన్లు పేర్కొన్నారు. గురువారం నాందేవ్‌వాడలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో ఆయన మాట్లాడారు. అల్ట్రా సౌండ్, ఈసీజీ, రొమ్ము, గర్భసంచి క్యాన్సర్లకు పరీక్షలు చేస్తారని, ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమా రాజ్, డాక్టర్ సూరి తదితర వైద్య బృందం నేతృత్వంలో ఈ క్యాంపును నిర్వహిస్తారన్నారు. కార్యదర్శి ప్రసాద్ రావు, జిల్లా గౌరవాధ్యక్షులు దత్తాత్రేయ తదితరులున్నారు.

పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాలుగవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. తెయూ మెయిన్ క్యాంపస్, భిక్కనూర్ సౌత్‌క్యాంపస్, గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి),ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ)లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 1594 మంది విద్యార్థులకు గానూ 1516 మంది హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

27 నుంచి పీజీ రెండో సెమిస్టర్..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని పీజీ 2వ సెమిస్టర్, ఇంటిగ్రేటెడ్ కోర్సులు 8వ సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్, బీఎల్ఐఎస్సీ పరీక్షలు ఈ నెల 27 నుంచి ప్రారంభమై సెప్టెంబర్ 6 వరకు కొనసాగుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ గురువారం తెలిపారు. పూర్తి వివరాలకుwww. telanganauniversity. ac. in ను సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న పీజీ బ్యాక్‌లాగ్..

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, పీజీ ఇంటిగ్రేటెడ్ బ్యాక్‌లాగ్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగినట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం జరిగిన పరీక్షలో 153 మంది విద్యార్థులకు 129 మంది హాజరైనట్లు చెప్పారు.

ఏఏవో విజయ్ కుమార్‌పై చర్యల కోసం నివేదిక

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్ నాగారం: జిల్లా విద్యుత్ శాఖ నిజామాబాద్ రూరల్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ విజయ్ కుమార్ వ్యవహార శైలిపై నివేదికను ఎస్ఈ రవీందర్ గురువారం వరంగల్ సీఎండీ వరుణ్‌రెడ్డికి పంపించారు. 'హెడ్ క్వార్టర్‌లో ఉండను.. హెచ్ఆర్ఏ తీసుకోను' అనే శీర్షికతో ఇటీవల సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్ఈ ఏఏవోను హెచ్చరించారు. అయినా ఆయనలో మార్పురావడంలేదని, దీంతో నివేదికను సీఎండీకి అందజేసినట్లు తెలిపారు.

ఒలింపిక్ పతకాలే లక్ష్యం

- కీర్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎంపిక పోటీలు
- ఫిట్‌నెస్ నైపుణ్య పరీక్షలు
- పైలట్ ప్రాజెక్టుగా నిజామాబాద్ ఎంపిక



జంప్ చేస్తున్న విద్యార్థినులు



ప్రతిభ చూపిన విద్యార్థులతో రవి స్కూల్ కరస్పాండెంట్ సరళ, ప్రిన్సిపాల్ శ్యామ్, కోచ్ శ్రీనివాసరావు

పోటీల వివరాలు..

- షటిల్ రన్(చురుకుదనం ఎంత ఉందో తెలుసుకోవడానికి)
- స్టాండింగ్‌బ్రాడ్‌జంప్(నిలబడి జంప్ చేయడం)
- సిట్ రిచ్(కాళ్లు, చేతులు చాచి కూర్చోవడం)
- 800మీటర్ల రన్(ఎక్కువ దూరం పరుగెత్తడం)
- 30 మీటర్ల రన్(రన్నింగ్ స్పీడ్ తెలుసుకోవడానికి)
- మెడిసిన్ బాల్(1 కేజీ బాల్ పట్టుకొని వెనుకకు విసరడం)
- వర్టికల్‌జంప్(జంప్ చేయడం)

నిజామాబాద్‌నాగారం: భవిష్యత్తులో 2032, 2034లలో జరిగే ఒలింపిక్ పోటీల్లో కచ్చితంగా మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించేలా క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్(కీర్తి) కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా దేశంలోని 500 జిల్లాల్లో ఆయా పాఠశాలల్లో విద్యార్థుల ఫిట్‌నెస్‌తో పాటు వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలు నైపుణ్యాన్ని వెలికి తీయడానికే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందులో భాగంగా క్రీడాకారుల అన్వేషణ కోసం నిజామాబాద్ నగరంలోని రవి పబ్లిక్ స్కూల్‌లో గురువారం విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించి జాబితాను సిద్ధం చేశారు. రవి పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ సరళ మహేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్యామ్ సహకారంతో కోచ్‌లు శ్రీనివాసరావు, సుబ్బారావులు, జిల్లా కబడ్డీ కోచ్ మీసాల ప్రశాంత్, అర్చరీ కోచ్ మురళి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థుల ఎత్తు, బరువు చూశారు.

జిల్లాలో రెండు స్కూళ్లలోనే...

రాష్ట్ర వ్యాప్తంగా మొట్టమొదటి సారి నిజామాబాద్ జిల్లాలో బుధవారం విజ్ఞాన్‌స్కూల్‌లో, గురువారం రవి పబ్లిక్ స్కూల్‌లో కీర్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చి సుమారు 300 మంది విద్యార్థుల జాబితాను ఢిల్లీకి పంపించనున్నారు. దీంతో పాటు బెంగుళూర్‌లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశారు. నోడల్ ఆఫీసర్ సైతం ఉంటారు. అక్కడే విద్యార్థుల జాబితాను పరిశీలించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా స్పోర్ట్స్ స్కూల్‌లోకి పంపించి శిక్షణ ఇప్పించనున్నారు.

భవిష్యత్‌లో పతకాలు సాధించడానికే..



ప్రధాని నరేంద్ర మోదీ క్రీడల కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. చైనా, జర్మనీ, యుఎస్ఏ తదితర దేశాల మాదిరిగా పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి చిన్నప్పటి నుంచే శిక్షణ ఇస్తేనే పతకాలు సాధించగలుగుతాం. అందులో భాగంగానే కీర్తి ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ గుర్తిస్తారు. పక్కా ప్రణాళికతో విద్యార్థుల శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు పరిశీలించిన తర్వాతే విద్యార్థులకు చదువుతో పాటు శిక్షణ ఇస్తారు. భవిష్యత్తులో ఒలింపిక్‌లో అత్యధిక పతకాలు సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం.

– కె శ్రీనివాస్‌రావు, కీర్తి ఇండియా కబడ్డీ కోచ్

'హర్ ఘర్ తిరంగా' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ



ఫుట్‌బాల్ క్రీడాకారులతో..

సుభాష్‌నగర్: ఆగస్టు 15న హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. గురువారం నగర బీజేపీ కార్యాలయంలో జిల్లా పదాధికారుల సమావేశం అధ్యక్షుడు దినేష్ కులాచారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ..ఆగస్టు 10, 11 తేదీల్లో గ్రామాలు, మండల కేంద్రాల్లో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు, స్మారక చిహ్నాల చుట్టూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, విగ్రహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి పుష్పాంజలి ఘటించాలని తెలిపారు. ఆగస్టు 11 నుంచి 13 వరకూ ప్రతి మండలం, మున్సిపాలిటీ, అసెంబ్లీ స్థాయిలో యువ మోర్చా ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించాలన్నారు. ఆగస్టు 13 నుంచి 15 వరకు ప్రతి కార్యకర్త తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి, సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో గర్వంగా పోస్ట్ చేయాలని పేర్కొన్నారు.

రుణమాఫీ కొందరికే వర్తింపజేయడం సిగ్గుచేటు

జిల్లాలో దాదాపు 2.75 లక్షల మంది రైతులకుగాను కేవలం 46,456 మందికి మాత్రమే రుణమాఫీ చేశారని, మిగతా వారికి వర్తింపజేయకపోవడం సిగ్గుచేటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆగస్టు 15 వరకు రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గ్రామాలవారీగా రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరించి, రుణమాఫీ కాని రైతులతో నిరసన కార్యక్రమం చేపడుతామని హెచ్చరించారు. సీనియర్ నాయకులు బద్దం లింగారెడ్డి, జీవీ నర్సింహారెడ్డి, కేపీ రెడ్డి యాదవ్, నక్క రాజేశ్వర్, నాగులపల్లి రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం

నిజామాబాద్‌నాగారం: ఇందూర్ ఫుట్‌బాల్ అకాడమీ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో గురువారం ఫుట్‌బాల్ టోర్నీని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందూర్ (నిజామాబాదు) జిల్లా అంటేనే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులకు పుట్టినిల్లని జిల్లా కేంద్రంలో క్రీడాకారులకు సరైన సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియం కావాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు. 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మలేషియాలో యువకుడికి అగచాట్లు

- ఏజెంట్ల మోసానికి గురైన అక్కపూర్‌వాసి
- హైకమిషన్ ఆఫ్ ఇండియా చొరవతో తిరిగి ఇంటికొచ్చిన బాధితుడు

మాచారెడ్డి : ఏజెంట్ల మోసంతో మలేషియా వెళ్లిన యువకుడు అక్కడ నానా అగచాట్లు పడిన అనంతరం హై కమిషన్ ఆఫ్ ఇండియా చొరవతో బయట పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామానికి చెందిన గడ్డం మహేశ్ 2022 జనవరిలో బతుకుదెరువు కోసం విదేశాలకు వెళదామని తెలిసిన వ్యక్తుల ద్వారా ఏజెంట్లు లక్ష్మణ్, దుర్గాప్రసాద్‌లను సంప్రదించాడు. కాగా ఏజెంట్లు మలేషియా కు వీసా ఇస్తామని, అక్కడ రోజుకు 10 గంటల డ్యూటీ, ఆటోమొబైల్ స్పేర్ పార్ట్స్ కంపెనీలో పని కల్పిస్తామని నమ్మించారు. దీంతో మహేశ్ వారికి రూ.1.20 లక్షలు చెల్లించాడు. అయితే ఏజెంట్లు మహేశ్‌కు టూరిస్ట్ వీసా ఇచ్చి 2022 మే2న మలేషియాకు పంపించారు. మలేషియాలో ఫ్లైట్ దిగాక మహేశ్ ను లక్ష్మణ్, అమీన్ అనే వ్యక్తులు తీసుకెళ్లి ఓ కంపెనీలో పనికి పెట్టించారు. రెండు నెలల 15 రోజులు పని చేసినప్పటికీ కంపెనీ యాజమాన్యం జీతం డబ్బులు ఇవ్వకుండా వేధిస్తుంటే మహేశ్ మలేషియాలోని హై కమిషన్ ఆఫ్ ఇండియాను ఆశ్రయించారు. హై కమిషన్ ఆఫ్ ఇండియా అధికారులు 2023 మే 27న మహేశ్ ను మలేషియా నుంచి ఇండియాకు తిరిగి పంపించారు. తనను మోసం చేసిన ఏజెంట్ లక్ష్మణ్, రాఘవపురం దుర్గాప్రసాద్, అమీన్ లపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

కరెంట్‌షాక్‌తో వ్యక్తి ..



గోపాల్ మృతదేహం

గాంధారి(ఎల్లారెడ్డి): కరెంట్‌షాక్‌తో గోపాల్(30) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన చద్మల్ తండాలో చోటు చేసుకుంది.వివరాలు..తండాకు చెందిన గోపాల్(30) బుధవారం రాత్రి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఉదయం పలుచోట్ల గాలించారు. చద్మల్ తండా–బీర్మల్ తండా మధ్య ఉన్న సోయాబీన్ పంట పొలంలో గోపాల్ విగతజీవిగా పడి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దగ్గరకు వెళ్లి చూడగా పొలాల్లో అమర్చిన కరెంటు తీగలకు తగిలి షాక్‌తో మృతి చెందినట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా చేశారు. మృతుడి భార్య మాలోత్ షాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మురికికాలువలో పడి ఒకరు..

ఖలీల్ వాడి: నగరంలోని మూడో పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణ మందిరం వెనుక ఉన్న పెద్ద మురికి కాలువలో పడి వడ్ల రమేశ్(49) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. వివరాలు.. ధర్పల్లి మండలంలోని దుబ్బాకకు చెందిన వడ్ల రమేష్(49) నగరంలోని బైపాస్ రోడ్డులో లారీ మెకానిక్‌గా పని చేస్తున్నారు. మురికి కాలువలో రమేశ్ పడి ఉండటాన్ని రమేశ్ కుటుంబసభ్యులకు పరిచయస్తుడైన ఎండీ హనీఫ్ గురువారం గమనించారు. వెంటనే ఆయన భార్య మేఘమాలకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 5న దుబ్బాక వెళ్లారని, అప్పటి నుంచి ఫోన్ చేసినా రమేశ్ స్పందించలేదని మృతుడి భార్య తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

చికిత్స పొందుతూ మరొకరు..

భిక్కనూరు: రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన తుమ్మ శ్రీధర్(38) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. శ్రీధర్ కొంతకాలంగా భిక్కనూరులో నివాసం ఉంటున్నాడు. బీడీ కార్మికుడిగా, ఆటో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అప్పుల బాధతో ఈనెల 1న గడ్డిమందు తాగాడు. సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై వివరించారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు



గాయపడ్డ బాలుడు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని 24వ వార్డు హనుమాన్ టేకిడీ కాలనీలో మూడున్నరేళ్ల బాలుడిపై కుక్కదాడి చేసింది. ఇంటి ముందు ఆడుకుంటున్న సమయంలో కుక్క కరవడంతో బాలుడు అరిచాడు. గమనించిన స్థానికులు కుక్కను అక్కడి నుంచి తరిమేశారు. కుక్క దాడిలో బాలుడి చెంపపై గాయాలయ్యాయి. బాలుడిని స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వార్డులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని తగిన చర్యలు చేపట్టాలని బల్దియా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని వార్డు కౌన్సిలర్ గాండ్ల సుధారాణి అన్నారు. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు జునైద్ కోరారు.

ఆలయంలో చోరీ

ధర్పల్లి: రామడుగులోని వేంకటేశ్వర ఆలయంలో బుధవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. గురువారం ఉదయం ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ పూజ చేయడానికి వెళ్లగా గర్భగుడి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న స్వామివారి వెండి కిరీటం, వెండి ఆభరణాలు గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎస్సై విక్రమ్ పరిశీలించారు. ఆలయ పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్‌లో గది సీల్‌ను ఓపెన్ చేస్తున్న అధికారులు

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్ ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. సాధారణ ఎన్నికలు ముగిసి, నిర్ణీత గడువు పూర్తయిన నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల సమక్షంలో గోడౌన్‌ను తెరిపించి, ఒక్కో సెగ్మెంట్ వారీగా బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన గదులను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, అంబదాస్ రాజేశ్వర్, రాజాగౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్, సాత్విక్, అగ్నిమాపక శాఖ అధికారి నర్సింగ్‌రావు, తదితరులున్నారు.

విధుల బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖలీల్‌వాడి: జనగామ జిల్లా కేంద్రంలో న్యాయవాదులపై పోలీసుల భౌతిక దాడిని నిరసిస్తూ గురువారం జిల్లా కోర్టులలో విధుల బహిష్కరించి, కోర్టు చౌరస్తాలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. న్యాయవాద రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసన వ్యవస్థల ద్వారా తయారు చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బాధ్యులైన పోలీసు అధికారులను సర్వీస్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, దోస్ పాల్ సురేష్, అందెల దీపక్, కుమార్ దాసు అల్గొట్ రవీందర్, భాను చందర్, తదితరులున్నారు.

'కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలి'



మాట్లాడుతున్న తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

తెయూ(డిచ్‌పల్లి): నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి సూచించారు. గురువారం తెయూ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో 'కమ్యూనికేటివ్ ఇంగ్లిష్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. విదేశాలకు వెళ్లాలన్నా, పెద్ద పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాలన్నా విద్యార్థులు తప్పనిసరిగా ఇంగ్లిష్‌పై పట్టు సాధించి ఉండాలన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. రిసోర్స్ పర్సన్, ఇంగ్లీష్ విభాగం కాంట్రాక్ట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వామి విద్యార్థులకు కమ్యూనికేటివ్ ఇంగ్లిష్ అంశంపై అవగాహన కల్పించారు. ఈవెంట్ మేనేజర్లుగా బి.శివ, సాయికుమార్, సతీష్, శ్రీకాంత్ వ్యవహరించారు. వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, ఈవెంట్ మెంటార్, ఎంబీఏ విభాగాధిపతి ప్రొఫెసర్ సీహెచ్‌ఆంజనేయులు, డీన్ ప్రొఫెసర్ ఖైసర్ మహమ్మద్, కామర్స్ హెచ్‌వోడీ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తిగత సెలవులపై ఈఎస్

ఖలీల్‌వాడి: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. మల్లారెడ్డి వ్యక్తిగత సెలవుపై వెళ్లారని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మరో 15 రోజులలో సెలవులు ముగించుకొని తిరిగి ఈఎస్‌గా బాధ్యతలు తీసుకుంటారని ఈఎస్ ఆఫీస్ తెలియజేసింది.

కన్న కొడుకే కాలయముడయ్యాడు

- బైక్ కొనివ్వలేదని కట్టెతో తండ్రిని కొట్టి చంపిన కుమారుడు
- మద్నూర్‌లో ఘటన



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

మద్నూర్(జుక్కల్): ఒక్కగానొక్క కొడుకే తండ్రి పాలిట కాలయముడయ్యాడు. బైక్ కొనివ్వలేదనే కారణంతో నార్లవార్ అర్జున్(64)ను ఆయన కొడుకు కొట్టి చంపాడు. ఈ ఘటన మద్నూర్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. బిచ్కుంద సీఐ నరేష్, ఎస్సై విజయ్ కొండ తెలిపిన వివరాలు.. మద్నూర్‌కు చెందిన నార్లవార్ ఎల్లవ్వ, అర్జున్‌కు కుమారుడు వెంకట్ ఉన్నాడు. రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్లి తల్లి, తండ్రి ఒకచోట, కుమారుడు మరో చోట నివాసం ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవడంతో పాటు రూ.2 లక్షల అప్పు ఉండడంతో వారికి ఉన్న భూమిని ఇటీవల తండ్రి అర్జున్ విక్రయించాడు. భూమి అమ్మగా రూ.6 లక్షలు వచ్చాయి. అందులోంచి రూ.2 లక్షల అప్పు తీర్చేయగా మిగిలిన రూ. 4 లక్షలు అర్జున్ తన బ్యాంక్ అకౌంట్‌లో దాచుకున్నాడు. వారం క్రితం ఎల్లవ్వ, అర్జున్‌లు మద్నూర్‌కు వచ్చారు. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి వచ్చిన వెంకట్, బైక్ కోసం డబ్బులు ఇవ్వాలని తండ్రితో గొడవ పడ్డాడు. తండ్రి డబ్బులివ్వడానికి ఒప్పుకోకపోవడంతో పక్కనే ఉన్న కట్టెతో తలపై కొట్టాడు. దీంతో అర్జున్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పక్క గదిలో ఉన్న తల్లి ఎల్లవ్వ వచ్చి అడ్డుకోవడంతో ఆమెను కూడా కొట్టాడు.



నార్లవార్ అర్జున్(ఫైల్)


ఉదయం లేవకపోవడంతో..

రాత్రి జరిగిన గొడవలో అర్జున్ తలకు గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. ఆస్పత్రికి వెళ్లాలని అర్జున్‌కు ఆయన భార్య ఎల్లవ్వ సూచించినా ఏం కాలేదంటూ తలకు టవల్ కట్టుకొని పడుకున్నాడు. గురువారం ఉదయం ఎంతకీ అర్జున్ లేవకపోవడంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు వెంకట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నరేశ్ చెప్పారు.

పోక్సో కేసులో ఒకరికి ఏడేళ్ల జైలు శిక్ష

లింగంపేట(ఎల్లారెడ్డి): పోక్సో కేసులో నేరస్తుడికి కామారెడ్డి మొదటి అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస్‌నాయక్ ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్పీ సింధుశర్మ వెల్లడించారు. వివరాలు.. లింగంపేట మండలానికి చెందిన 8 ఏళ్ల బాలిక 2018, జూలై 7న ఇంటి బయట ఆడుకుంటుండగా శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన ఎల్లనురం గుడ్డేల రాములు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. భయాందోళనకు గురైన బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు 2018 జూలై 8న లింగంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కేసు విచారణ చేపట్టిన అప్పటి సీఐ సుధాకర్, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, అదనపు ప్రాసిక్యూటర్ శేషు, ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ఎస్సై చైతన్య కుమార్‌రెడ్డి, ఎస్‌బిటీ మురళి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ మనోహర్‌రావు, కిరణ్‌గౌడ్‌లను ఎస్పీ అభినందించారు.

గంజాయి విక్రేత అరెస్టు



నవీపేట: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం గంజాయి విక్రయిస్తున్న సయ్యద్ రఫీక్‌ను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటేష్ తెలిపారు. రఫీక్ దగ్గర 500 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై నర్సింహాచారి, సిబ్బంది భూమన్న, భోజన్న, అవినాష్, విష్ణు, లక్ష్మణ్, ఉత్తమ్ తదితరులున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

నిజామాబాద్ రూరల్: గొల్లగుట్ట తండాకు చెందిన రాజు(30) చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు.. గొల్లగుట్ట తండాకు చెందిన రాజు ఈ నెల 6న రాత్రి 8 గంటలకు తాగి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో మద్యానికి డబ్బులు ఇవ్వాలని గొడవపడ్డాడు. వారు డబ్బులు ఇవ్వకపోవడంతో దుర్భాషలాడుతూ నేను చనిపోతానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గురువారం ఉదయం 10 గంటలకు గ్రామ చెరువులో రాజు మృతదేహం స్థానికులకు కనిపించగా వారు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారమిచ్చారు. రాజు భార్య సంయుక్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.